

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెం శ్రీ వివేకానంద ట్యుటోరియల్స్‌లో ఇస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ శ్రీచైతన్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.శైలజ పిలుపునిచ్చారు. సోమవారం వేట్లపాలెం వివేకానంద ట్యుటోరియల్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను ఆమె ప్రారంభించారు. శిక్షణకు వేట్లపాలెం, జి.మెడపాడు, పెద్ద బ్రహ్మదేవం, బిక్కవోలు, ఎల్లపల్లి, మర్రిపూడి, ఆర్‌బి పట్నం గ్రామాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఖత్తర్ గ్యాస్ ఎజిఎం బొడ్డు రామారావు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. ఏప్రిల్ 25వ తేదీ వరకు ఈ శిక్షణ నిర్వహించినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ ప్రభావితం చేయగలరా..?

- పిఠాపురం పర్యటన అర్ధంతరంగా వాయిదా
- మూడో రోజు మధ్యాహ్నం తిరిగి రాక

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టి అంతా పిఠాపురంపైనే ఉంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలని ఆయన ఆశిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఎంచుకున్న పిఠాపురం నియోజకవర్గంలో పట్టు కోసం అనేక విధాలుగా ప్రయత్నం చేస్తున్నారు. అయితే అనూహ్యంగా ఈసారి టిడిపి నేత ఎస్‌విఎస్‌ఎన్.వర్మ ఆయనకు ప్రధాన అడ్డంకి అవుతారని అభిప్రాయం వినిపించింది. దానిని తొలగించుకునేందుకు ఇప్పుడు పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టారు. వర్మను సంతృప్తి పరచడమే లక్ష్యంగా ఆయన సాగుతున్నారు. పిఠాపురంలో నాలుగు రోజులు పర్యటన పేరుతో ఇక్కడికి చేరగానే తొలుత వర్మ ఇంటికి వెళ్లారు. సుమారు గంట పాటు ఏకాంతంగా కీలక అంశాలపై చర్చ జరిపారు. వర్మ తల్లి కాళ్లకు వందనం చేసి వచ్చారు. ఆ తర్వాత చేబ్రోలు సభలో ఆయన మాట్లాడారు. అయితే సభ నిర్వహణ తీరు జనసేన శ్రేణుల్లో అసంతృప్తిని కల్పించింది. పవన్‌కళ్యాణ్ ఆశించినంత జనం రాకపోవడం, వచ్చిన జనం కూడా సభ ఆలస్యం కావడంతో వెనక్కి వెళ్లిపోవడంతో శ్రేణులను నిరుత్సాహ పరిచింది. అదే సమయంలో పవన్ కళ్యాణ్ ప్రసంగం కూడా పెద్దగా ఆకట్టుకునే రీతిలో లేదని అభిప్రాయం వినిపించింది. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గం ప్రజలతోపాటు రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి ఆయన నుంచి అభిమానులు పదునైన విమర్శలు ఆశించారు. కానీ పవన్‌కళ్యాణ్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. గతానికి భిన్నంగా ప్రసంగం సాగింది. దీంతో పార్టీ శ్రేణులు పెద్దగా సంతృప్తి పడలేదని అభిప్రాయాలు ఈ సందర్భంగా వ్యక్తం అయ్యాయి. అదే సమయంలో వచ్చిన కార్యకర్తల్లో కూడా తొక్కిసలాట జరగడంతో కొంతమంది గాయపడ్డారు. ఒకరికి కాలు విరిగింది. గాయపడిన కార్యకర్తల విషయంలోనూ జనసేన శ్రద్ధ చూపలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అయితే పవన్ కళ్యాణ్ రెండో రోజు ఆలయాల సందర్శన, ఆ తర్వాత టిడిపి, బిజెపి శ్రేణులతో కలిసి నిర్వహించిన సభలో తన గెలుపు బాధ్యత పూర్తిగా వర్మదే అన్నట్లుగా మాట్లాడడం ఆశక్తికరంగా మారింది. 'నా గెలుపు మీ చేతుల్లో పెట్టాను' అంటూ పవన్ కళ్యాణ్ వర్మ చేతిలో చేయి వేసి మరీ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. పిఠాపురం నా ఒక్కడి విజయం మాత్రమే కాదు వర్మ విజయం, మనందరి సమిష్టి విజయం అంటూ చెప్పారు. ఇలా మొత్తంగా పూర్తిగా వర్మపైనే తన గెలుపు భారాన్ని వేసి పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నట్టుగా కనిపిస్తుంది. ఇది ఏ మేరకు విజయవంతం అవుతుందోనన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వర్మకు సహజంగా కాపుల్లో చాలా వ్యతిరేకత ఉంది. కాపు నేతలే గతంలో ఎంఎల్ఎగా వర్మను తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఆయనకు బిసిల్లో మంచి పట్టు ఉందన్న అభిప్రాయం జనసేనాని మనసులో ఉంది. దానికి తగ్గట్టుగానే కాపు ఓట్లు తనను చూసి వేసినప్పటికీ బిసి ఓట్లు సమీకరించాలంటే వర్మ మద్దతు తనకు అత్యవసరమని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే వర్మను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన పెద్ద స్థాయిలోనే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో వర్మను పవన్ కళ్యాణ్ బస చేసిన హోటల్ గేటు వద్ద నెట్టివేయడంతో కొంత గందరగోళం ఏర్పడింది. దానిపై టిడిపి శ్రేణులు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. వర్మను కూడా నెట్టేసే పరిస్థితులు రావడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ పరిస్థితులన్నింటినీ చక్కదిద్ది వర్మ, జనసేనాని కలిసి పిఠాపురంలో జనసేన జెండా ఎగరవేసేందుకు ఏ విధంగా కృషి చేస్తారనేది ప్రశ్నార్ధకంగా మారింది.

మరోవైపు అనూహ్యంగా పవన్ కళ్యాణ్ రెండో రోజుకే తన పర్యటనను వాయిదా వేయడం కీలక పరిణామంగా కనిపిస్తుంది. ఆయన నాలుగు రోజులపాటు పిఠాపురంలోనే ఉండేందుకు పూర్తిస్థాయి షెడ్యూల్ ఖరారు చేశారు. మొదటిరోజు చేబ్రోలు బహిరంగ సభ, రెండో రోజు ఆలయాల సందర్శన, మూడో రోజు బూత్ కమిటీ నాయకులతో సమావేశం, నాలుగో రోజు నియోజకవర్గానికి చెందిన నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడి పార్టీకి దిశ నిర్దేశం చేయాల్సి ఉంది. దానికి భిన్నంగా తనకు అనారోగ్య సమస్య పేరుతో పవన్ కళ్యాణ్ అనూహ్యంగా వెనుతిరగడం జనసేన శ్రేణులను సైతం ఆశ్చర్యపడేలా చేసింది. ఆయన 4 రోజులు పర్యటన పేరుతో ముందుగా షెడ్యూల్ ఖరారు చేసుకుని ఒకరోజు తర్వాత రెండో రోజుకే మధ్యాహ్నం తర్వాత వెనుదిరికి వెళ్లిపోవడం పట్ల అందరూ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా ఆయనకు గొంతు నొప్పి ఉండడంతో వెళ్లాల్సి వచ్చిందని అందుకే హైదరాబాద్ పయనమయ్యారని చెబుతున్నప్పటికీ విమర్శకులు మాత్రం దీన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇదిలావుండగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత మళ్ళీ పిఠాపురం వచ్చారు. స్థానికంగా ఉన్న కొంతమందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే పవన్ కళ్యాణ్ పిఠాపురానికి ఎన్నికలకు ముందే సరైన సమయాన్ని కేటాయించకపోతే ఎన్నికల తర్వాత పిఠాపురం వైపు చూస్తారా? లేదా? అనే ప్రశ్నలు ప్రత్యర్థుల నుంచి ప్రారంభం అయ్యాయి. ఎంపీ వంగా గీత లాంటి వారు కూడా ఇదే రీతిలో విమర్శలు ఎక్కు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పవన్ రీ షెడ్యూల్ చేసుకుని పూర్తిస్థాయిలో మూడు మండలాల్లోనూ ఏ మేరకు పర్యటిస్తారు? ఎన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు? ఓటర్లను ఏ రకంగా ప్రసన్నం చేసుకుంటారు? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల అభిమానాన్ని ఆయనకు అనుకూలంగా మార్చడంలో వర్మ ఏ మేరకు కృషి చేసి, సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.



పోస్టల్, హోమ్ ఓటింగ్‌పై ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల సిబ్బంది, వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పిఒలు, ఎపిఒలు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, ఫెసిలిటీ సెంటర్స్, జిల్లాలో ఎన్నికల సక్రమ నిర్వహణకు అవసరమైన సన్నద్ధత ఇతర ఎన్నికల అంశాలపై మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటన విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ డాక్టర్ డి.తిప్పే నాయక్, డిపిఒ కె.భారతి సౌజన్య, సైనిక వెల్ఫేర్ అధికారి ఎం.కృష్ణారావు, డిఎల్‌డిఒ పి.నారాయణ మూర్తి, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పని ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై మరణించిన భవన నిర్మాణ కార్మికుడు వీర నాగేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం మండలంలోని కట్టమూరు సచివాల యం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మృతి చెందిన కార్మికుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్.నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మార్చి 23వ తేదీన బిల్డింగు పిల్లర్స్‌కు కాంక్రీట్ వేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. కట్టమూరు గ్రామంలో రూ.50 లక్షలు, రూ.కోటి దాటి భవనాలు నిర్మించేవారు బిల్డింగ్ ప్లాన్, లేబర్ సెస్సు కట్టకుండానే పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పంచాయితీకి రావలసిన ఆదాయం, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు రావలసిన ఆదాయం కోల్పోతున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక మరిడమ్మ గుడి చెరువు గట్టు వీధిలోని తాపీ వర్కర్స్ భవనంలో గదుల నూకరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తుల మురళి, గడపా శివబాబు, నీలంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - కోటనందూరు

మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న యువత యువకులకు ఓటు హక్కు వినియోగంపై మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మాలిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం తుని సాయి ఉత్సవ వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్ మాలిక్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉంటుందని, నైతిక విలువలు గల సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నిక చేసుకోవాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తన తండ్రి దాడిశెట్టి రాజాను గెలిపించాలని కోరారు. తద్వారా సిఎంగా జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ మాలిక్

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: నానాజీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

లబ్ధిదారులకు నకిలీ ఇళ్ళ పట్టాలు ఇచ్చి మోసం చేసిన వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గంగ రాజునగర్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి ఎంఎల్ఎ కురసాల కన్నబాబు లబ్ధిదారులకు నకిలీ ఇళ్ళ పట్టాలు ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక వైసిపి నాయకులు కొన్ని వేల డూప్లికేట్ పట్టాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈక్రమంలో కాకినాడ రూరల్ మండలం స్వామి నగర్లో 118 మందికి నకిలీ ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారన్నారు. స్వామి నగర్లో తాము ఎటువంటి పట్టాలు మంజూరు చేయలేదని ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా స్థానిక తహశీల్దార్ కార్యాలయం తెలిపిందని అన్నారు. జర్నలిస్టుగా పని చేసిన వ్యక్తి ఓట్ల కోసం ప్రజలను మోసం చేసే స్థాయికి దిగజారిపోవడం దారుణమన్నారు. లబ్ధిదారులంతా తమ దగ్గర ఉన్న పట్టాలను ఒకసారి ఆర్‌డిఎం, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లి తనిఖీ చేయించుకోవాలని సూచించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఆ గ్రామ పరిధిలోనే ఇళ్ల స్థలాలను ఇస్తామని తెలిపారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలో 6 వేల నకిలీ ఓట్లు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఒకి ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి సమాధానం లేదని అన్నారు. వీటిపై స్థానిక ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎల్దుటి లక్ష్మి నారాయణ, పాలిక రమణ, భోగిరెడ్డి కొండబాబు, అద్దంకి వీరబాబు, గవర శ్రీరాములు, దొడ్డిపట్ల అప్పారావు, తాటిమళ్ళ రమేష్, కండెపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

నిధుల్లేక ఆగిన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కరప

సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ఫించన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధులు కొరతే కారణమని, ఎన్నికల కమిషన్, టిడిపి కాదని మాజీ ఎంఎల్ఎ కాకినాడ రూరల్ పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి, జనసేన పార్టీ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. సోమవారం యండమూరు గ్రామంలో వారు ఇంటింటికీ తిరిగి పింఛన్‌దారులతో మాట్లాడారు. జగన్ రెడ్డి స్వార్థ రాజకీయం వల్లే పింఛన్‌దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారన్నారు. పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టాడని ఆరోపించారు. ఖజానాలో నిధులు లేకనే పింఛన్ల పంపిణీ చేయలేదని, ఏప్రియల్ 1న నుంచే ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదని ప్రశ్నించారు. ఒకటో తేదీన పెన్షన్లకు ఇవ్వాల్సిన రూ.13వేల కోట్లను మార్చి 16 నుంచి 30వ తేదీలోపే తన అనుకూల కాంట్రాక్టర్లకు ఈ మొత్తాన్ని మళ్లించారని విమర్శించారు. తన చేతగానితనాన్ని జగన్ ఎన్నికల కమిషన్‌పైనా, టిడిపి పైనా నెట్టుతున్నారని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ. 4,000 పింఛన్ అందిస్తామని అన్నారు. వాలంటీర్లను ప్రజా సేవకులుగా కాకుండా తన పార్టీ కార్యకర్తల్లా వినియోగించడం వల్లే ఎన్నికల కమిషన్ వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, బి.కొండబాబు, బి.గంగాధర్, పి.జానకిరామయ్య, ఎం.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధిరాలితో మాట్లాడుతున్న టిడిపి, జనసేన నాయకులు



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- సామర్లకోట

సుమారు 41వ సంవత్సరాలుగా రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (పబ్లిక్ వే)గా ఎన్.సత్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం సత్యనారాయణ పదవీ విరమణ వీడ్కోలు సత్కార సభ స్థానిక సుందరయ్య అంజమ్మ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సత్యనారాయణ 9 సార్లు విధి నిర్వహణలో డిఆర్ఎం అవార్డులు, ఒకసారి జిఎం అవార్డును గెల్చుకున్నారని తెలిపారు. రైల్వే ఉద్యోగులు సత్యనారాయణ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులకు రైల్వే ఉద్యోగులు, కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సామర్లకోట సెక్రటరీ స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామర్లకోట రైల్వే ఎడిఇఎన్ డి.శివప్రసాద్, ఇన్‌ఛార్జ్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ బి.రామసుబ్బారావు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

3న సచివాలయల్లో పెన్షన్ పంపిణీ

ప్రజాశక్తి - కిర్లంపూడి

పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 3న ఆయా గ్రామ సచివాలయాల్లో చేపట్టాలని ఎంపిడిఒ బడే రాజేశ్వర్‌రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్స్ నుంచి మొబైల్ ఫోన్స్, బయోమెట్రిక్ స్కానర్స్, డివైస్ మొదలగు పరికరాలు పంచాయతీ కార్యదర్శులు స్వాధీనం చేసుకుని ఎంపిడిఒ కార్యాలయానికి అందించాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లోని ముఖ్య కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి కె.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మరియు సంక్షేమ విద్యా సహాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఈశ్వర్‌నగర్ డ్రెయిన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణయ్య పేట గ్రామ పంచాయతీ ఎపిఎస్‌పి నుంచి ఈశ్వర్ నగర్‌కు వెళ్ల రహదారి మధ్యలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. కల్వర్ట్ విస్తరణలో భాగంగా హైవేకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, ఆ స్థానంలో తాత్కాలికంగా ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. మిగిలిన సగం కల్వర్ట్ పూర్తిచేసి, ఈ ఐరన్ గ్రిల్ తొలగించి స్లాబ్ వేయాల్సివుంది. అయితే అధికారులు ఈ తాత్కాలిక ఏర్పాటును శాశ్వతం చేసేశారు. గ్రిల్ మొత్తం క్రిందికి వంగిపోవడంతో వాహనచోదకుతు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన సగం కల్వర్ట్ పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మార్గ మధ్యలో ఉన్న ఐరెన్ గ్రిల్

కూల్ డ్రింక్స్‌తో దంతాలకు హాని

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కూల్ డ్రింక్స్ (శీతల పానీయాలు) తీసుకోవడం వల్ల దంతాలకు హాని కలగడంతోపాటు, పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వేసవిలోనే కాకుండా నేటి యువత ప్రతిరోజు కూల్ డ్రింక్స్ తీసుకుంటున్నారని, కొందరైతే అర్ధరాత్రి కూడా వీటిని తాగడం జరుగుతుందని అన్నారు. కూల్ డ్రింక్స్ నిల్వ కోసం హానికరమైన రసాయనాలు కలుపుతారని అన్నారు. దీనివలన గ్యాస్, ఎసిడిటీ, కిడ్నీలో రాళ్లు, ఊబకాయం వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. డ్రింక్స్ స్థానంలో మజ్జిగ, చెరుకు రసం, కొబ్బరి బొండం, పుచ్చకాయ, పండ్ల రసాలు వంటివి తీసుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

'ప్రో - కార్ట్ రేసింగ్' పోటీలు ప్రారంభం


ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 4 వరకూ జరిగే జాతీయ స్థాయి ప్రో కార్ట్ రేసింగ్ ఛాంపియన్ షిప్ సోమవారం ప్రారంభం అయ్యింది. ఈ పోటీలకు ఎపితోపాటు, చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌ల సభ్యులు పాల్గొంటున్నారని ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. 13 టీములకు మొత్తం 350 మంది సభ్యులు పాల్గొనడం జరిగిందన్నారు. నిష్ణాతులైన తటస్థ న్యాయనిర్ణేతల పర్యవేక్షణ లో ఎంపిక జరుగుతుందని తెలిపారు. వెహికల్ మోడల్, వెయిట్, బ్రేక్, ఇంజన్ పిక్ అప్, లోడ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన జరిగే ఫైనల్ పోటీల్లో స్పీడ్‌లో సైతం పోటీ నిర్వహించిన తర్వాత విజేతను ప్రకటించడం జరుగుతుందన్నారు. ప్రతీ విభాగం నుంచి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



పోటీలకు సిద్ధమైన విద్యార్థులు

కార్టూ'నిజం'



ఆదిత్యలో ముగిసిన పిసిబి డిజైన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగంలో పిసిబి డిజైన్ వర్క్ షాప్ జరిగింది. గత ఆరు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమం సోమవారంతో విజ్ఞనదా యకంగా ముగిసిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిక్షణలో ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే పిసిబి బోర్డుల తయారు వాటి డిజైనింగ్, వినియోగించే పద్ధతిపై విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ఎపిఎస్ఎస్‌డిసి ప్రతినిధి సిహెచ్.సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగిం ది. ముగింపు సభలో ప్రిన్సిపల్ డాక్ట ర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, డీన్‌లు డాక్టర్ జి.సురేష్, వి. సత్యనారాయణ, ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.రాధ, డాక్టర్ కర్ణ విష్ణువర్ధన్‌రెడ్డి, కో-ఆర్డినేటర్స్ అసోసియేట్ ప్రొఫె సర్లు శ్రీనివాస్, డాక్టర్ సిరిధర మాట్లాడారు. అలాగే ఎంసిఎ విభాగం లో ఎపి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ అప్లి కేషన్ డెవలప్‌మెంట్ అనే అంశంపై 5 రోజులుగా జరిగిన సదస్సు ముగిసిం ది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎపి ఎస్-ఎస్‌డిసి ప్రతినిధి ఎస్.వరప్రసాద్, డీన్ అకాడెమిక్ డాక్టర్ ఎస్.రమశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎంవి.రాజేష్, కోర్డినేటర్ టి.ఉదయలక్ష్మి, అధ్యాపకు లు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ప్రారంభం

ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకాని కల్ విభాగంలో రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో ఆర్టిఫి సియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభమైం ది. 5 రోజులపాటు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్‌కు చెందిన పి.రమాకాంత్ నిర్వహిస్తున్నారు. మెకా నికల్ విభాగంలోని తృతీయ సవత్స రం చదువుతున్న విద్యార్థుల కొరకు నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని డీన్ అకాడమి క్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్ అన్నారు. విభాగాధిపతి డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, వర్క్ షాప్ కోఆర్డినేటర్ నల్ల భానుతేజ పాల్గొన్నారు.

ఒలింపియాడ్ - నీట్ కోర్సులు

ప్రజాశక్తి - సామర్లకోట

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ విద్యా సంస్థలో ఒలింపియాడ్ - నీట్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయని సామర్లకోట శ్రీవివేకానంద స్కూల్ కరస్పాండెంట్ బిఎస్.సరోజినీ తెలిపారు. సోమవారం స్థానిక స్కూల్లో పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి 1 నుంచి 9వ తరగతి వరకు ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒలింపియాడ్, నీట్ విద్యా కోర్సును అమలు చేస్తామన్నారు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సామర్లకోటలో ప్రారంభమైన తమ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నట్టు తెలిపారు. వేడుకల్లో ఎస్‌పి సతీష్‌కుమార్, ఆర్‌జెడి నాగమణి, డిఎస్‌పి లతాకుమారి, ట్రైనీ డిఎస్‌పి సాయి ఈశ్వర్య యస్వంత్, ఎంఇఒ వైఎస్.శివరామకృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లీదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే రామచంద్రపురం బ్రాంచ్‌కి 10వ తరగతి వరకూ విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్. సొల్యూషన్, డీన్ సిహెచ్.వికాస, చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రూ.9 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

గత వారం రోజులుగా పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో రూ.9 లక్షలు విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 9 ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల ద్వారా 36 మంది సిబ్బంది వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడం ద్వారా ఈ సొత్తు స్వాధీనం చేసుకున్నా మన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని అచ్చంపేట వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.8 లక్షలు విలువ చేసే కారులో అక్రమంగా తరలిస్తున్న 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారన్నారు. అలాగే రూ.లక్ష విలువ కలిగిన 290 లీటర్ల సారా, 9.72 లీటర్ల డిపిఎల్ బాటిళ్లు, సుమారు రూ.3450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక పార్టీ తరపున ప్రచారం చేస్తున్న ఇద్దరు వాలంటీర్లను సస్పెండ్ చేశామన్నారు.



నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జి.వేమవరం రాయమెరక ఆశ్రమం సెంటర్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జామకాయల తూము సెంటర్ నుంచి జి.వేమవరం వెళ్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గుంతలో పడి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఒక మహిళకు తీవ్ర గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆసుపత్రిలో వివాహిత మృతి

ప్రజాశక్తి - కాజులూరు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత చెల్లి ఆదిలక్ష్మి (22) పరిస్థితి విషమించి మతి చెందింది. ఈ సంఘటనపై గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ వివరాలను వెల్లడించారు. మండలంలోని సలపాక గ్రామానికి చెందిన చెల్లి ఆదిలక్ష్మికి అదే గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఆదిలక్ష్మికి అనారోగ్య కారణంగా ఉండడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఆది లక్ష్మి ఒంటిపై టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించు కోగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తహశీల్దార్ శాంతి లక్ష్మి, ఎస్ఐ తులసిరామ్‌లు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆటో ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో ఆటో తిరగబడి వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు గాయాలపాలయ్యారు. సామర్లకోట నుంచి పెద్దాపురం విద్యార్థులతో వెళ్తున్న ఆటో విమల్ కంపెనీ సమీపంలో ముందు వెళ్తున్న బైకును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థినులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థినులను సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట మహిళా ఎస్ఐ మౌనిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులను వైసిపి పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ పరామర్శించారు.

రూ.1.20 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని జగన్నాథపురం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1.20 లక్షల విలువ చేసే నగదును సీజ్ చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనాలు తనిఖీలు చేస్తుండగా తాళ్లపూడికి చెందిన నీలం వీరభద్రరావు ఎటువంటి బిల్లులు లేకుండా విజయవాడ నుంచి కారులో రూ.1.20 లక్షలను తీసుకొస్తున్నారన్నారు. దీంతో సీజ్ చేశామన్నారు.

గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం కడియపులంక తూర్పు డెల్టా ప్రధాన కాలువలోకి సోమవారం స్నానానికిదిగి గల్లంతైన యువకుడు మృతి చెందాడని కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. కడియం మండలం దామిరెడ్డిపల్లికి చెందిన రాయపాటి అయ్యప్ప(30) కడియపులంక సెంటర్ జాతీయ రహదారి పక్కన పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాలువలో స్నానానికి దిగిన అయ్యప్ప ప్రమాదవశాస్తు కొట్టుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తిరుగుడు మెట్టకు చెందిన వివాహిత సైదు భాగ్యశ్రీ(24) కడుపునొప్పి భరించలేక సోమవారం ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తాళ్లపూడి ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. భాగ్యశ్రీ కొంతకాలంగా కడుపునొప్పి, తలనొప్పితో బాధ పడుతోందన్నారు. మృతురాలి పెద్దమ్మ పంతుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- ముమ్మిడివరం

యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముమ్మిడివరం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం పడమటపాలెంకి చెందిన మంజుల సతీష్‌కుమార్, నడకుదటి బాలకృష్ణ బొలెరో వాహనంలో సుమారు 2100 లీటర్ల డీజిల్ అక్రమంగా తరలిస్తుండగా ముమ్మిడివరం పోలీసులు డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.సురేష్ బాబు తెలిపారు.

బైకును కారు ఢీకొని ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్లలోని కొండాలమ్మ గుడి సమీపంలో సోమవారం బైకును కారు ఢీకొని ఒకరి తీవ్ర గాయాలయ్యాయి. రావులపాలెంకు చెందిన ఆదిమూలం ఈశ్వరరావు బైకుపై డివైడర్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి కారు ఢీకొని డివైడర్ పైకి దూసుకు పోయింది. ఈ ఘటనలో ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

కాటవరం గ్రామానికి చెందిన కందుకూరి వెంకన్న కూలి పనుల మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జాలిమూడికి చెందిన యడ్ల లచ్చయ్య డబ్బులు తీసుకుని పనికి రావట్లేదు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణలో లచ్చయ్య అన్న కొడుకు రాంబాబు బకెట్‌తో వెంకన్నను కొట్టాడు. దీంతో తలపై, కుడి భుజంపై వెంకన్నకు రక్తపు గాయాలు అయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై యడ్ల అచ్చియమ్మ, కందుకూరి ప్రదీప్, కండవల్లి శేఖర్, మేకల సుబ్రహ్మణ్యంపై కౌంటర్ కేసు నమోదైంది.

యానాం వార్తలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

ఎంపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - యానాం

ఎన్ఆర్.కాంగ్రెస్ పార్టీ, బిజెపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. సోమవారం స్థానిక యర్రా గార్డెన్లోని గాజుల మినీ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తాను యానాం అభివృద్ధి కోసం పుదుచ్చేరిలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్టు తెలిపారు. నమశ్శివాయం ఎంపీగా గెలుపొందిన పక్షంలో యానాం అభివీద్ధికి పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నేడు యానాం రాక


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.వైద్ధిలింగం మంగళవారం యానాం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్దాని దినేష్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం బాలయోగి స్టేడియం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి సావిత్రి నగర్‌లో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థి వెంట మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి, ఎంఎల్ఎ వైద్యనాథన్, పెద సత్య ఫేరుమాళ్, ఎఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ హరివరగన్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రతినిధి ఎ.కాంగయ్యన్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటంశెట్టి రామ్మూర్తి, మల్లాడి వీరస్వామి, కాదా పవన్, పెసల వెంకటేష్, దవులూరి పతి, విళ్ల చిన్ని, జి.దినేష్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో 13 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 9వతరగతి ప్రవేశ పరీక్షకు 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాష్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు మొత్తం 161 మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది ఎంపికైనట్టు వెల్లడించారు.

రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలపై వివక్షత తగదు

ప్రజాశక్తి - కాకినాడ

భారత రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలపై వివక్షత తగదని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అభిప్రాయపడింది. సోమవారం స్థానిక సుందరయ్య భవన్ మినీ మీటింగ్ హాలులో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ అధ్యక్షతన జరిగింది. సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ఉపాధ్యక్షులు కాశీ బాలయ్య, సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లూరి వేంకటేశ్వర్లు, స్మార్ట్ సిటీ ముస్లిం ఫెడరేషన్ కార్యదర్శి నజీరుద్దీన్, సిపిఐ నగర కార్యదర్శి దిమ్మల నారాయణమూర్తి, సిఐటియు నాయకులు టి.రాజా, మానవహక్కుల సంఘం సభ్యులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన్ మున్నగు వివిధ మతాల పెద్దలతో ప్రతి వారం సమిష్టిగా సమావేశం కావాలని నిర్ణయించారు. నవతరం ఆలోచనలతో పౌరసత్వ ప్రాథమిక హక్కులను కాపాడుకునే వేదికగా నిలవాలని, సవరణ చట్టం వలన ఎదురయ్యే అనర్థాలు గురించి నిరంతరం చర్చించాలని నిర్ణయించారు. వేదిక కన్వీనర్ అయితా బత్తుల రామేశ్వరరావు 3వ కుమారుడు భీమారావు ముంబైలో గుండె పోటుతో మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న వేదిక తీవ్ర విచారం వ్యక్తం చేసింది. సమావేశం అనంతరం ఇంద్రపాలెంలోని ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర సంతాపాన్ని తెలిపారు.


చర్చించుకుంటున్న లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు

నేటి నుంచి ఇంటింటా ప్రచారం


వర్మతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్

ప్రజాశక్తి - పిఠాపురం

మంగళవారం నుంచి పట్టణంలో ఇంటింటా ప్రచారాన్ని చేపడతామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో 20, 21, 22 వార్డుల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వర్మ మాటాడుతూ రాబోయే కాలంలో అందరూ పొత్తులో భాగంగా పవన్ కళ్యాణ్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి చంద్రబాబు నాయుడు గౌరవం కాపాడాలన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని పలు వార్డులలో, మధ్యాహ్నం గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి పవన్ కళ్యాణ్, ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జనసేన పార్టీ ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, రాజు, లోవబాబు, సూర్యప్రకాష్, దొరబాబు, సత్యానంద రెడ్డి, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

జనసేనలోకి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం


పవన్‌తో మండలి

అవనిగడ్డ సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గ నేత నిమ్మక జయకృష్ణ జనసేన పార్టీలో చేరారు. సోమవారం పిఠాపురంలో జనసేన అధి. నేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి జనసేనాని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అవని గడ్డ నుంచి మండలి బుద్ధప్రసాద్ టిడిపి సీటును ఆశించారు. అయితే పొత్తులో భాగంగా దీన్ని జనసేనకు కేటాయించారు. ఈ నేపథ్యంలో బుద్ధప్రసాద్ జనసేన నుంచి పోటీ చేయనున్నారు. ఈయన 1999, 2004, 2014 ఎన్నికల్లో గెలిచారు. జాయినింగ్ తర్వాత నిమ్మక జయకృష్ణ పిఠాపురంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం గిరిజనులకు చేసింది ఏమి లేదన్నారు. గిరిజనులు వెనుక బాటు తనానికి జగన్ కారణమన్నారు. అభివీద్ధిని మరిచిపోయి కాసుల వెంట పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమితో కలిసి పనిచేసి వైసిపిని తరిమి కొడతామన్నారు. పవన్ కళ్యాణ్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, గిరిజనులు, గిరిజన ప్రాంత అభివృద్ధికి కోసం కృషి చేస్తానని అన్నారు.

సిఎస్‌పై చర్యలు తీసుకోవాలి: నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

పింఛన్‌దారులకు పింఛన్ సొమ్మును అందించడంలో విఫలమైన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డితో చేతుల కలిపి నిర్ధేశించిన సమయానికి లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వకుండా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే సోమవారం పింఛన్లు పంపిణీ జరగలేదన్నారు. ఒకటో తేదీన పింఛన్ దారులకు పింఛన్ సొమ్మును చెల్లించాల్సి వున్నప్పటికీ రూ. 13 వేల కోట్ల పెన్షన్ సొమ్మును కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించడం దారుణమన్నారు. సిఎం జగన్‌తో సిఎస్ చేతులు కలిపారని ఆయనపై చర్యలు తీసుకోవాలని నెహ్రూ డిమాండ్ చేశారు. తమ పార్టీ వాలంటీర్లకు వ్యతిరేకం కాదని, ప్రభుత్వం తీరును మాత్రమే ప్రశ్నిస్తున్నామని చెప్పారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో తమ పార్టీపై నిందలు వేస్తున్నారని అన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వానికి సలహాలు ఇచ్చుకోవాలి తప్పితే రాజకీయ పార్టీ నాయకుడిగా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వాలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా వాడుతున్న విషియాన్ని ఎన్నికల సంఘం గుర్తించిందని, అందుకే ఎన్నికలకు వారిని దూరం పెట్టిందన్నారు. ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు ఎస్‌విఎస్. అప్పలరాజు, కొత్త కొండబాబు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

ప్రచారాలు..చేరికలు...

ప్రజాశక్తి - యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల రోజు రోజుకీ చేరువుకానుండటంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోపక్క ఒక పార్టీకి చెందిన నాయకుడు మరో పార్టీలోకి జంపింగ్‌లు జోరందుకున్నాయి. **యు. కొత్తపల్లి** మండలంలో పలువురు వైసిపి నాయకులు జనసేన పార్టీలో చేరారు. కొండవరం ఎంపిటిసి సభ్యులు మారిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో కొత్తపల్లి నుంచి సానా నాగు ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. పిఠాపురంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలోచేరిన వారికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పిళ్ళంకలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద టిడిపి సీనియర్ నాయకుడు సాగి నానిబాబురాజు తన అనుచరులతో వైసిపిలో చేరారు. వైసిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి, ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సాగి హరిబాబు, జంపన అజయ్, కనుమూరి వెంకటేశ్వరరాజు, సాగి బొజ్జిరాజు, శివరామరాజు, వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ కృష్ణంరాజు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గోపులంక, గోపాలపురం, గోవలంక, ఇంజరం పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు కోరుకొండ కిరణకుమారి పాల్గొన్నారు. **కాజులూరు** టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు లీలశంకర్ వైసిపిలో చేరారు. మండలంలోని తణుకువాడలో వైసిపి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసిపి యువ నాయకుడు తోట పృధ్విరాజ్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఉప్పుమిల్లి, నామవానిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కన్వీనర్ చింతలపాటి శ్రీనివాసరాజు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. **పిఠాపురం** మండలంలోని గోకివాడ గ్రామంలో ఎంపీ వంగా గీత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు..ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కీర్తి హరనాథ్‌బాబు, మాజీ సర్పంచ్ మహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు వేమగిరి నాగరాజు, బుజ్జి, కొమ్ము చిన్నబాబు, స్వామి, గండేపల్లి బాబీ, పెదపాటి రమేష్ పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ పరిధిలోని 4, 28 వార్డులలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వార్డ్ కౌన్సిలర్ యండమూరి విజయలక్ష్మి, తాడి రాజశేఖర్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ ఆధ్వర్యంలో వైసిపి పెద్దాపురం నియోజక వర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాపుగంటి కామేశ్వరరావు, త్సలికి సత్యభాస్కరరావు, విడదాసరి రాజా, గవరసాన సూరిబాబు, మిరియాల రాజా పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తుమ్మల రామస్వామి, విత్తనాల వెంకటరమణ, నిమ్మకాయల రంగనాగ్, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, మొయిళ్ళ కృష్ణమూర్తి పాల్గొన్నారు. **కోటనందూరు** మండలంలో కెవి.అగ్రహారం గ్రామంలో మంత్రి దాడిశెట్టి రాజా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


తాళ్లరేవులో ప్రచారం చేస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

రూ 4.6 కోట్ల పన్నుల వసూలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 13,789 అసెస్మెంట్‌లకు సంబంధించి రూ.4.6 కోట్లు వసూలు చేసినట్లు కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. సోమవారం మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ.6.88 కోట్లు పన్నుల డిమాండ్ ఉండగా వీటిలో ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి కుళాయి పన్నులు, ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు రూ.4.6 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, ఈ పన్నుల వసూళ్లకు సహకరించిన అధికారులు, సిబ్బందిని ఆమె అభినందించారు.

'రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరం'

ప్రజాశక్తి - కోటనందూరు

ఆంధ్ర రాష్ట్రానికి అనుభవజ్ఞులైన చంద్రబాబునాయుడు పరిపాలన అవసరమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తుని పట్టణంలో విజయదుర్గ ట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు యనమల రామకృష్ణుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రామకృష్ణుడు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గాడి తప్పిందని, అప్పులు ఊబిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్ర పరిపాలన మళ్లీ గాడిలో పడాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి కావాలన్నారు. తుని నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి వెంకటేష్, బోడపాటి రామకృష్ణ, గంటిపల్లి నారాయణరావు, ఇనిగంటి సత్యనారాయణ, మల్ల గణేష్, సిద్ధాంతపు సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొర్రెపూడి గ్రామంలో హైస్కూల్ భవనం వెనుకగల ప్రభుత్వ స్థలం ఆక్రమణ పై గ్రామస్తుడు యర్రమనీడి బుచ్చి రాజేష్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం తహశీల్దార్‌ను కలిసి ఆయన ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ భవనం వెనకాల ప్రభుత్వ స్థలం కొందరు ఆక్రమించుకుని, ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న డ్రైయినేజీ పనుల కోసం తవ్విన మట్టిని ఆ స్థలంలో వేసి చదును చేస్తున్నారని తెలిపారు. ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మకం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో పి.సత్యనారాయణ, పి.వీరబాబు, ఎ.సురేష్ ఉన్నారు.

ప్రిన్సిపల్ రాఘవరావుకు సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విఎస్ఎల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన రాఘవరావును రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా అడబాల మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపల్‌గా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ జివి.రమణ, కె.సాయిబాబా, గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు, రాజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 3 నుంచి వార్డు సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయాల వెల్ఫేర్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో సామాజిక పింఛన్ల పంపిణీ మార్గదర్శకాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పింఛన్ లబ్ధిదారులు ఎటువంటి కార్డులు అవసరం లేకుండా కేవలం ఆధార్ కార్డుతో పింఛను పొందవచ్చన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 6,200 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. వీరందరికీ పింఛన్లు పంపిణీ నిమిత్తం వార్డు సచివాలయాలలో క్లస్టర్ వారీగా సెక్రటరీలను నియమించామన్నారు. పింఛనుదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సచివాలయాల వద్ద వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

రిసోర్స్‌పర్సన్‌గా గౌరీ నాయుడు

ప్రజాశక్తి - పిఠాపురం

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన దక్షిణ భారత ప్రాంతీయ కేంద్రం(సౌత్ రీజనల్ లాంగ్వేజ్ సెంటర్) ఆధ్వర్యంలో మార్చి 27 నుంచి 31 వరకు నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక యాత్రకి పట్టణానికి చెందిన యువ సాహితీ వేత్త డాక్టర్ కిలారి గౌరీ నాయుడు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. తెలుగు అధ్యాపక శిక్షణ పొందుతున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బృందానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. అనంతరం దక్షిణ భారత తెలుగు శిక్షణ అధ్యాపక బృందానికి నాయకత్వం వహిస్తున్న డాక్టర్ మిరియాల సత్యనారాయణ తనకు ప్రమాణ పత్రం అందించి సత్కరించారని గౌరీ నాయుడు తెలిపారు.

పలువురు వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గుమ్మరేగుల పంచాయతీకి చెందిన పలువురు వాలంటీర్లు రాజీనామాలు చేశారు. సోమవారం గ్రామ సర్పంచ్ రాపర్తి రామకృష్ణతో కలసి వారు ఎంపిడిఒ ప్రేమ్‌సాగర్‌ను కలిసి రాజీనామా పత్రాలను అందించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక తిమ్మాపురం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ రూరల్ నియోజకవర్గం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సామగ్రి భద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటింగ్ యంత్రాలు భద్రపరచడానికి అవసరమైన సిసి కెమెరాలు, అగ్నిమాపక యంత్రాలు, అవసరమైన రాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో మండల సర్వేయర్ ఆచార్యులు, డిటి సురేష్, ఆర్ఐలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.